క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లికి చెందిన వెంకట్‌రెడ్డి (64) అనారోగ్యానికి గురై గురువారం మృతిచెందాడు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అదే విధంగా మండల కేంద్రానికి చెందిన కృష్ణయ్య, రామచంద్రయ్య ఇటీవల మృతిచెందగా.. ప్రభాకర్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఒక్కొక్కరికి రూ.3000 చొప్పున ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు.. ప్రశాంత్‌రెడ్డి, డేవిడ్, రాహుల్, శివ కుమార్, రమేష్, హరికిషన్‌రెడ్డి, ఆరీఫ్, సురేష్, శ్రీను, మోహన్‌రెడ్డి, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్



సమ్మర్ క్యాంప్‌లో పాల్గొన్న రాజ్‌కుమార్, క్రీడాకారులు

మంచాల: గ్రామీణ ప్రాంతాల్లోని యువతీయువకులు ఉచిత సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని మంచాల పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్ అన్నారు. గురువారం మంచాల ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు వేసవి సెలవుల్లో క్రీడల్లో చురుకుగా పాల్గొనాలని కోరారు. 14 సంవత్సరాల లోపు బాలబాలికలకు సమ్మర్ క్యాంప్‌లో కబడ్డీ, వాలీబాల్ క్రీడలు నేర్పిస్తారన్నారు. ఈ క్యాంప్ నిర్వహణకు ముందుకు వచ్చిన పీఈటీలు వెంకటేశ్, గిరి ప్రసాద్‌ను ఆయన అభినందించారు. స్థానిక యువజన సంఘాల నాయకులు, గ్రామస్తులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉపాధికూలీకి అండగా నిలిచిన బీజేపీ నేత

నగదు, సరకుల అందజేత



బాధితుడికి నగదు, సరుకులు అందజేస్తున్న గణేశ్ నాయక్

యాచారం: గ్రామీణ ఉపాధి హామీ పనుల వద్ద గాయాలపాలై ఇంటివద్దే ఉంటున్న ఓ కూలీకి బీజేపీ నేత అండగా నిలిచాడు. వివరాలు... మండల పరిధిలోని మంతన్‌గౌరెల్లికి చెందిన మూడవత్ కోటకు కొద్దిరోజుల కింద ఉపాధి పనులు చేస్తుండగా కాలికి తీవ్ర గాయమైంది. ఈ క్రమంలో అప్పటినుంచి ఇంటివద్దే ఉంటున్నాడు. విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన బీజేపీ గిరిజన మోర్చా మండల అధ్యక్షుడు గణేశ్ నాయక్ గురువారం బాధితుడికి రూ.5 వేల నగదుతో పాటు 50 కిలోల బియ్యం అందజేశాడు. ఉపాధి పనులు చేస్తూ గాయపడితే పరిహారం చెల్లించే నింబంధన ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంపై గణేశ్ నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడవత్ కోటకు భవిష్యత్‌లో అండగా ఉంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కస్నా నాయక్, మోతీలాల్ నాయక్, బిక్కు నాయక్, సర్దార్ నాయక్, లోకేశ్, మంగ్లీ, జయ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ భూమి అక్రమ రిజిస్ట్రేషన్

అధికారులకు గ్రామస్తుల ఫిర్యాదు

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట గ్రామ శివారులో ఉన్న అంబభవానీ మాత దేవాలయానికి సంబంధించిన భూమిని కొందరు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని పలువురు గ్రామస్తులు గురువారం దేవాదాయ శాఖ అదనపు కమిషనర్ కృష్ణవేణిని కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ప్రతులను స్థానిక విలేకరులకు అందజేశారు. ఎలికట్ట గ్రామ శివారులోని అంబభవానీ మాత దేవాలయానికి సంబంధించిన భూమి సర్వే నెంబర్ 441లో 3 ఎకరాల 28 గుంటలు ఉందని పేర్కొన్నారు. అయితే ఈ భూమి దేవాదాయ శాఖకు సంబంధించి 43 రిజిస్టర్‌లో నమోదు చేయబడి ఉందని పేర్కొన్నారు. ఈ భూమిని 2015లో తుమ్మలపల్లి గుల్లె కృష్ణయ్య తన పేరున అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకొని, ప్రస్తుతం తిరిగి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుత మార్కెట్‌లో ఈ భూమి విలువ రూ.15కోట్ల వరకు ఉందని, దేవాలయానికి సంబంధించిన భూములను నిబంధనలకు విరుద్ధంగా అమ్మినవారు, కొన్న వారిపై చర్యలు తీసుకొని దేవాలయ భూములను కాపాడాలని పేర్కొన్నారు. ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో ఎంపీటీసీ కావలి శ్రీశైలం, సంజీవయాదవ్, ఆర్ల యాదయ్య, రాజు, నారం రాంరెడ్డి, కృష్ణయ్య యాదవ్, శివ, శర్వలింగం, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

కంపు కొడుతోంది

- ఎంపీపటేల్‌గూడలో ఇళ్ల మధ్య, రోడ్లపై నిలుస్తున్న మురుగు
- రోగాల బారిన స్థానికులు
- సరైన ఔట్‌లెట్ లేకపోవడమే కారణం
- పట్టించుకోని మున్సిపల్ పాలకవర్గం, అధికారులు



ఎంపీపటేల్‌గూడ కాలనీలోని ఇళ్ల మధ్య నిలిచిన మురుగు

ఇబ్రహీంపట్నం రూరల్: కూతవేటు దూరంలో జిల్లా కలెక్టరేట్, పలు ప్రఖ్యాత ఇంజనీరింగ్ కళాశాల లు, ఐటీ కంపెనీలు ఉన్నప్పటికీ ఆ కాలనీలో డ్రైనే జీ నీరు రోడ్లపై పారుతుండటంతో స్థానికులు ఇ బ్బందులు పడుతున్నారు. కంపు భరించలేకపోతు న్నాం సమస్య పరిష్కరించండి మహాప్రభో అని అ ధికారులను వేడుకున్నా పట్టించుకోవడం లేదనే వి మర్శలు ఉన్నాయి. ఇదీ ఆదిబట్ల మున్సిపాలిటీ ఎంపీపటేల్‌గూడలోని పరిస్థితి. వివరాల్లోకి వెళ్తే.. ఆ దిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని ఎంపీపటేల్‌గూడ, బొంగ్లూర్ మధ్యలో ఉన్న మైహోమ్స్ కాలనీ నుంచి వచ్చే మురుగు ఎంపీపటేల్‌గూడ రోడ్డుకు వచ్చి చేరుతుంది. సరైన ఔట్‌లెట్ లేకపోవడంతో రోజువారి మురుగునీరు వచ్చి ఓపెన్ ప్లాట్లలో నిలిచి చెరువును తలపిస్తోంది. అలా నిలిచిన మురుగు ఎంపీపటేల్‌గూడ ప్రధాన రహదారిపై చేరి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ రోడ్డుకు అవతలివైపు విశ్వేశ్వరయ్య ఇంజనీరింగ్ కళాశాల, అంతపురం కాలనీ ప్రజలు నివాసం ఉంటున్నారు. మురుగుతో వారంతా ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది. గత కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి.

రోగాలబారిన ప్రజలు..

కాలనీ మధ్యలోని ఓపెన్ ప్లాట్లలో మురుగు ఏళ్లతరబడి నిలిచిపోవడంతో విపరీతమైన దోమలు, ఈగలు విజృంభిస్తున్నాయి. మరోవైపు పందులు కూడా విహారం చేస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. దీంతో స్థానికులు రోగాలబారిన పడుతున్నారు. మున్సిపల్ అధికారలుఉ స్పందించి వెంటనే సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

రోగాలబారిన పడుతున్నాం



డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో ఏళ్లుగా మురుగు ఒకే దగ్గర చేరి చెరువును తలపిస్తోంది. ఈగలు, దోమలు వృద్ధి చెందటంతో రోగాలబారిన పడుతున్నాం. మురుగు నుంచి వచ్చే కంపు భరించలేకపోతున్నాం. వెంటనే సమస్య పరిష్కరించాలి.

– సంగమేశ్వరరావు, ఎంపీ పటేల్‌గూడ

రోడ్లపై మురుగు పారుతోంది



బొంగ్లూర్ నుంచి ఎంపీపటేల్‌గూడ వెళ్తే రహదారి పొడవునా మురుగు పారుతోంది. రోడ్ల వెంట రావాలంటే వాహనదారులు, బాటసారులు ఇబ్బంది పడుతున్నారు. ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. పాలకవర్గం, అధికారులు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

– నర్సింహారెడ్డి, బీజేపీ నేత, ఆదిబట్ల

సమస్య పరిష్కరిస్తాం



కాలనీలో గతంలో రూ.లక్షల నిధులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేయించాము. అయితే కాలనీలో కొత్త ఇళ్ల నిర్మాణం, జనాభా పెరుగుదల వలన ఈ సమస్య ఉత్పన్నమవుతోంది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు, మున్సిపాలిటీలో కొత్త పాలకవర్గం రావడంతో కూడా అభివృద్ధి పనుల్లో కొంత ఆలస్యం అయిన మాట వాస్తవమే. త్వరలో సమస్య పరిష్కరిస్తాం.

– మర్రి అర్చన, కౌన్సిలర్

జాగ్రత్తలు పాటించండి

డాక్టర్ శిరీష



అవగాహన కార్యక్రమంలో శిరీష తదితరులు

తుర్కయంజాల్: డెంగీ బారిన పడకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ ఎస్.శిరీష సూచించారు. డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం తుర్కయంజాల్‌లో ఆమె మున్సిపల్ సిబ్బందితో కలిసి అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇంటి చుట్టుపక్కల నీరు నిలువ ఉండకుండా చూడాలని, దోమలు అధికంగా ఉన్నట్‌లైతే దోమ తెరలను వినియోగించుకోవాలని తెలిపారు. ప్రతి శుక్రవారాన్ని డ్రై డేగా పాటించి ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిలువ ఉంటే శుభ్రం చేసుకోవాలని అన్నారు. ఆశ వర్కర్ నవనీత, బిల్‌కలెక్టర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్ పీహెచ్‌సీలో..

అబ్దుల్లాపూర్‌మెట్: మండల కేంద్రంలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మెడికల్ ఆఫీసర్ శ్రావణ్ కుమార్ గురువారం డెంగీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. డెంగీ వ్యాధి దోమల వలన వస్తుందని.. దోమల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో వివరించారు. ఇంట్లో వాడుకునే పాత్రలను, పూలకుండీలను ఎప్పటికప్పుడు ఖాళీ చేస్తూ శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు శ్రీనివాస్, హేమ్‌లాల్, చంద్రశేఖర్, లక్ష్మీనారాయణ, నిర్మల, నర్సింహ, సిబ్బంది పాల్గొన్నారు.

వరి ధాన్యానికి బోనస్ ఇవ్వాల్సిందే..



నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నేతలు

షాద్‌నగర్: రైతులకు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం వరి ధాన్యానికి విధిగా రూ.500లు బోనస్ ఇవ్వాలని మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ అధిష్టానం పిలుపు మేరకు మున్సిపల్ వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజన్, పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్ ఆధ్వర్యంలో గురువారం ఆ పార్టీ నాయకులు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీకి కట్టుబడి ఉండాలన్నారు. లేనిపక్షంలో రైతుల తరఫున బీఆర్‌ఎస్ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. అనంతరం మార్కెట్ సెక్రటరీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బక్కన్న యాదవ్, తాంద్ర వెంకట్‌రెడ్డి, మన్నె నారాయణ, వెంకట్‌రెడ్డి, పల్లె శ్రీనివాస్‌రెడ్డి, భీష్వ రామకృష్ణ, శ్రీశైలంయాదవ్, గోపాల్, చందునాయక్, కిరణ్, శ్రీనివాస్‌గౌడ్, శేఖర్, శంకర్, నందీశ్వర్, రంగయ్య, కృష్ణ, రాఘవేందర్, వీరేశం పాల్గొన్నారు.

‘లయన్స్’ సేవలు అభినందనీయం



అంబలి అందిస్తున్న రాధాకృష్ణ

మీల్స్ ఆన్ వీల్స్ మల్టిపుల్ కోఆర్డినేటర్ రాధాకృష్ణ

కడ్తాల్: లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు సేవలు అభినందనీయమని మీల్స్ ఆన్ వీల్స్ మల్టిపుల్ కోఆర్డినేటర్ రాధాకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో రెండు నెలలుగా లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదానం, రాగి అంబలి కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంలో లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ గంగాపురం చెన్నకిషన్‌రెడ్డి పర్యవేక్షణలో రెండు నెలలుగా రాగి అంబలి, అన్నదాన కేంద్రాన్ని విజయవంతంగా నిర్వహించడం పట్ల అభినందనలు తెలిపారు. ప్రతిరోజు 400 మందికి పైగా ప్రజలకు అందించడం పట్ల క్లబ్ పీఆర్‌ఓ పాషా హర్షం వ్యక్తం చేశారు. సమాజ సేవకు క్లబ్ సభ్యులు అందిస్తున్న సేవలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వేణుగోపాల్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, క్లబ్ సభ్యులు బీక్యానాయక్, మహేశ్, లక్ష్మయ్య, వెంకటేశ్, రాజేందర్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు

షాద్‌నగర్: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటారని హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రి నుంచి ఫరూఖ్‌నగర్‌లోని పురవీధుల గుండా ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఫరూఖ్‌నగర్‌లోని గాంధీ విగ్రహం వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. ఎడిస్ అనే దోమ కాటు కారణంగా డెంగీ వస్తుందన్నారు. ఈ దోమ ఎక్కువగా చీకటి ఉండే ప్రాంతంలో, మంచి నీటిలో వృద్ధి చెందుతాయన్నారు. దోమ పగటి పూట మాత్రమే కుడుతుందని, వ్యాధి వచ్చిన వారికి అకస్మాత్తుగా తీవ్రంగా జ్వరం రావడం, తీవ్రమైన తలనొప్పి, కండరాలు, కీళ్ల నొప్పులు, ఆకలి మందగిస్తుందని తెలిపారు. డాక్టర్లు కార్తీక్, జగదీశ్, సంధ్య, ప్రవీణ, హెల్త్ సూపర్‌వైజర్లు చంద్రకళ, ఆప్తాలిక్ ఆఫీసర్ శ్రీహరి, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

దుకాణదారులకు జరిమానా

ఇబ్రహీంపట్నం: పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్న దుకాణదారులకు ఇబ్రహీంపట్నం మున్సిపల్ సిబ్బంది గురువారం జరిమానాలను విధించారు. ప్రధాన రోడ్లపై ఉన్న హోటల్స్, మటన్, చికెన్ సెంటర్లు, వివిధ దుకాణాలను తనిఖీలు చేసి ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. ఇకపై ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తే జరిమానాలనువిధించడమేగాక దుకాణాల లైసెన్స్‌లను రద్దు చేస్తామని మున్సిపల్ సిబ్బంది హెచ్చరికలు జారీ చేశారు.

ఇబ్రహీంపట్నంలో భారీ వర్షం



ఇబ్రహీంపట్నంలో కురుస్తున్న వర్షం

ఇబ్రహీంపట్నం: ఉక్కపోతతో అల్లాడుతున్న ఇబ్రహీంపట్నం పట్టణవాసులు గురువారం సాయంత్రం కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు. వేసవి కాలం ప్రారంభం నుంచే ఎండలు దంచి కొట్టాయి. ఈ క్రమంలో ఈనెల 7వ తేదీన ఇబ్రహీంపట్నంలో ఉరుములు మెరుపులతో కొద్దిపాటి వర్షం కురిసిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ఎండల తీవ్రత కొంత తగ్గినట్లుగా కనిపించిన ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మళ్లీ గురువారం మధ్యాహ్నం నుంచి వాతావరణం చల్లబడి సాయంత్రం ఓ మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయం అయ్యాయి. అయితే విద్యుత్ సరఫరాకు కొంతసేపు అంతరాయం కలిగింది.

యాచారం మండలంలో..

యాచారం: మండల పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం సాయంత్రం మోస్తారు వర్షం కురిసింది. యాచారం, మాల్, కొత్తపల్లి, తక్కళ్లపల్లి, చింతపట్ల , చింతుల్ల తదితర గ్రామాల్లో ఈదురుగాలు, మెరుపులు, ఉరుములతో కూడిన వర్షం కురిసింది. ఆయా గ్రామాల్లో వరిపంటకు నష్టం జరగడంతో పాటు మామిడి చెట్లకు ఉన్న కాయలన్నీ నేల రాలాయి.

కల్యాణోత్సవాన్ని ఘనంగా జరిపించండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి, నేతలు

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం సమీపంలోని ఓ గుట్టపై స్వయంభుగా వెలిసిన శ్రీలక్ష్మీనృసింహ స్వామి కల్యాణోత్సవంలో పాల్గొనవలసిందిగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని గురువారం ఆలయ భక్తులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఆహ్వానించారు. ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించే ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఈ సందర్భంగా ఎమ్మెల్యే విడుదల చేశారు. కల్యాణోత్సవాన్ని ఘనంగా జరిపించాలని, అన్నివిధాల తన సహాయ, సహకారాలుంటాయని ఎమ్మెల్యే తెలిపారు. మున్సిపల్, విద్యుత్ శాఖల సిబ్బంది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ పరిసరాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పాండు రంగారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు చందు, జగదీశ్వర్‌యాదవ్, అర్చకులు లక్ష్మణ్, ఆలయ భక్త బృందం కృష్ణ, టీ.కృష్ణ, రవీందర్, లక్ష్మణ్, శ్రీనివాసచారి తదితరులు ఉన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

బీజేపీ జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి

చేవెళ్ల: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని బీజేపీ జిల్లా కార్యదర్శి జి.వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని చనువెల్లి గ్రామంలో గురువారం నిజాముద్దీన్, వినయ్‌కుమార్‌ల స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో స్నేహ సంబంధాలు మెరుగుపడుతాయని చెప్పారు. క్రీడాకారులు ఆటల్లో స్ఫూర్తిని ప్రదర్శించాలని గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలని సూచించారు. యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి టోర్నమెంట్‌లు దోహదపడతాయన్నారు. గ్రామీణ స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు క్రీడాకారులు ఎదగాలని కోరారు. ఈ టోర్నమెంట్ నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, క్రీడాకారులు ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌చారి, వెంకట్‌రెడ్డి, రాజేందర్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, భూపతిరెడ్డి, తిరుపతిరెడ్డి, జైపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులతో చింతపట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2008-09 బ్యాచ్ విద్యార్థులు

యాచారం: మండల పరిధిలోని చింతపట్ల ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలకు చెందిన 2008–09 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు స్థానిక నిరిచ్ మౌండ్ హోటల్‌లో సమావేశమై పాఠశాల సమయంలో చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పూర్వ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. చింతపట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల అభివృద్ధికి తమవంతు కృషిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సత్తయ్య, యాదయ్య, మధుమోహన్, రాజు, అంజయ్య, ఐలేష్, పత్తి రాజు, శ్రీలత, మాధవి, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

ముహూర్తం ఖరారు



ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నికకు ఎట్టకేలకు ముహూర్తం ఖరారయ్యింది. ఈనెల 24వ తేదీ ఉదయం 11 గంటలకు ఆర్డీఓ అనంతరెడ్డి సమక్షంలో కొత్త వైస్ చైర్మన్‌ను ఎన్నుకునేందుకు మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు గురువారం జిల్లా కలెక్టర్ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలో 24 మంది కౌన్సిలర్లు ఉన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల మధ్య నెలకొన్న రాజకీయ విభేదాల కారణంగా మున్సిపాలిటీలో అవిశ్వాసాల ప్రక్రియకు తెరలేచిన సంగతి విదితమే. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్‌ఎస్‌ను వీడిన చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి కాంగ్రెస్ పార్టీలో చేరారు. నాటి నుంచి మున్సిపాలిటీలో రాజకీయ వేడి రాజుకుంది. అప్పట్లో మెజార్టీ కౌన్సిలర్లు కలిగియున్న బీఆర్‌ఎస్ పార్టీ.. ఇద్దరు కౌన్సిలర్లున్న బీజేపీతో చేతులు కలిపి చైర్‌పర్సన్ స్రవంతిపై అవిశ్వాస ప్రక్రియకు తెరలేపింది. ఈ క్రమంలో గత ఫిబ్రవరి 16న చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి(కాంగ్రెస్)పై బీఆర్‌ఎస్, బీజేపీ కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసం వీగిపోయిన సంగతి తెలిసింది. అసెంబ్లీ ఎన్నికల అనంతరం రాష్ట్రంలో మారిన రాజకీయ పరిస్థితులు ఆమెకు కలిసొచ్చిన అంశంగా చెప్పవచ్చు. మున్సిపాలిటీలో రాజకీయ సమీకరణాలపై కూడా ఈ ప్రభావం పడింది.

వైస్ చైర్మన్‌ను తొలగించడంలో సక్సెస్..

ఈ నేపథ్యంలో తమపై అవిశ్వాసం పెట్టేందుకు ప్రధానకారకుడుగా భావిస్తున్న వైస్ చైర్మన్ ఆకుల యాదగిరి(బీఆర్‌ఎస్)ని ఏలాగైనా గద్దె దించాలని కాంగ్రెస్‌కు చెందిన చైర్‌పర్సన్ స్రవంతి వర్గీయులు కంకణం కట్టుకున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో పావులు కదుపుతూ బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు కౌన్సిలర్లను తమవైపు తిప్పుకొని వైస్ చైర్మన్ ఆకుల యాదగిరి(బీఆర్‌ఎస్)పై గతనెల 4వ తేదీన అవిశ్వాసం పెట్టి మున్సిపల్ చైర్‌పర్సన్ వర్గీయులు సక్సెస్ అయ్యారు. తదుపరి వారం- పదిరోజుల్లో కొత్త వైస్ చైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేస్తారని అంతా భావించారు. ఈ నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ రావడం, ఎన్నికల పనుల్లో అధికారులు నిమగ్నం కావడం తదితర కారణాలతో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక నోటిఫికేషన్ విడుదలకు తీవ్ర జాప్యం చోటుచేసుకుంది. ఈనెల 13న లోక్‌సభ ఎన్నికలు పూర్తికావడంతో తాజాగా మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నికకు కలెక్టర్ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. దీంతో పట్నంలో అందరి దృష్టి కొత్త వైస్ చైర్మన్ ఎవరవుతారనే దానిపై పడింది.

24న పట్నం మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక

- నోటిఫికేషన్ విడుదల చేసిన కలెక్టర్
- అవిశ్వాస తీర్మానంతో పదవి కోల్పోయిన ఆకుల యాదగిరి
- కుర్చీ రేసులో కౌన్సిలర్ బర్ల మంగ!

బర్ల మంగకే ఎక్కువ అవకాశాలు..?

మున్సపాలిటీకి సంబంధించి చైర్ పర్సన్ పదవిని స్రవంతి కాపాడుకుంటే, వైస్ చైర్మన్ పదవిని ఆకుల యాదగిరి నిలబెట్టుకోలేకపోయాడు. కౌన్సిలర్లకు అడిగింది ఇవ్వడం, క్యాంపు రాజకీయాల ఆర్థికభారాన్ని పదవిని ఆశిస్తున్నావారే భరించినట్లు తెలిసింది. తాజాగా వైస్ చైర్మన్ ఆకులను గద్దె దించడంతోపాటు ఆ స్థానాన్ని దక్కించుకునేందుకు కౌన్సిలర్ బర్ల మంగ వర్గీయులు పట్టు వదలకుండా ప్రయత్నాలు చేస్తున్నారు. తెలంగాణ ఉద్యమకారుడైన కౌన్సిలర్ మంగ భర్త బర్ల జగదీశ్‌యాదవ్, మాజీ సర్పంచ్ కప్పరి లక్ష్మయ్య వైస్‌చైర్మన్ యాదగిరిని పదవినుంచి తొలగించడంతో కీలకపాత్ర పోషించిన సంగతి విదితమే. దీంతో వైస్ చైర్మన్ పదవిని కౌన్సిలర్ బర్ల మంగ దక్కించుకునే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. కౌన్సిలర్ మంగకు ఈ పదవిని కట్టబెట్టేందుకు ఆమె భర్త జగదీశ్‌యాదవ్ తీవ్రస్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ పదవిని ఆశిస్తూ మంగతో పోటీ పడేందుకు సిద్ధంగా ఎవరూ లేరని వినికిడి. అయితే ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో నెలల తరబడి కొనసాగుతున్న అవిశ్వాసాల పర్వాలకు ఈ వైస్ చైర్మన్ ఎన్నికతో తెరపడనుంది. వైస్ చైర్మన్‌గా ఎవరు ఎన్నిక అవుతారు, పోటీ ఉంటుందా.. అని ఈ అంశమే ఇప్పుడు పట్నంలో హాట్ టాపిక్‌గా మారింది.